క్లుప్తంగా

నేడు మంత్రి పెద్దిరెడ్డి రాక

చౌడేపల్లె: మండల కేంద్రంలో సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నారని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తెలిపారు. స్థానిక బజారు వీధిలో ప్రముఖ శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధారణ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా విమాన గోపుర కలశ మహా సంప్రోక్షణ జరిగేలా అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, భక్తులు హాజరు కావాలని కోరారు.

మహాభారత యజ్ఞానికి రూ.20 వేల విరాళం



సోమల: మండలంలోని ఇరికిపెంట పంచా యతీ వడ్డిపల్లె భారతం మిట్టలో మహా భారత యజ్ఞ నిర్వహణకు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వేముల హరినాథ్ ఆదివారం రూ.20 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, పార్టీ వివిధ విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు దుర్గా రాజారెడ్డి, సుబ్బు యాదవ్, నేతలు పీఎల్ఆర్ రాజారెడ్డి, శ్రీరాములు, షేక్ బాషా, ఆటో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

గంగవరం: మండలంలోని కీలపట్ల మాదిగపల్లి, కురప్పల్లి గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు భగవద్గీత ప్రచారం, పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్ర గ్రంథాల్లో ఒకటైన భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక వంద రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను వితరణగా అందజేశారు. సభ్యులు భాస్కర్, బాలాజీ, హేమంత్, వాణిశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గంగవరం: మండలంలోని గుండ్రాజుపల్లె వద్ద ఆదివారం ఆటోను వెనుక నుంచి టెంపో ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. పోలీసుల కథనం.. మార్లపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ చెంగ్రాయప్ప ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని గుండ్రాజుపల్లె వెళ్తున్నాడు. పలమనేరు–బెంగళూరు హైవేలో బాలాజీ భవన్ సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న గంగాపురం గ్రామానికి చెందిన కృష్ణప్ప (60) స్వల్పంగా గాయపడ్డాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయానికి మైక్‌సెట్ విరాళం



సదుం: మైక్‌సెట్ అందిస్తున్న పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని బూరగమంద పంచాయతీ పచ్చార్లమాకులపల్లెలోని రామాలయానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రూ.19 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను విరాళంగా అందించారు. దాన్ని ఎంపీ తరఫున గ్రామ పెద్ద దామోదరరెడ్డికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆదివారం అందజేశారు. ఎంపీ దాతృత్వంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచ్ నారాయణరెడ్డి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, పాపిరెడ్డి, దాము పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళులు



అన్నదానం చేస్తున్న నాయకులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొరస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అన్నదానం చేశారు. పార్టీ నాయకులు శంకర్‌కుమార్, సత్య, భాస్కర్, మణి, రవి, మోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

బైరెడ్డిపల్లె : మహతీ ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈశిబిరంలో 68 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 18 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. పీఈఎస్ వైద్యాధికారులు వినూష, అనిల్‌కుమార్, దివ్య, కిరణ్, మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

గోవా యాత్రకు ఆర్టీసీ బస్సు

పుంగనూరు: వేసవి సెలవుల్లో గోవా యాత్రకు వెళ్లే వారి కోసం ఈనెల 26న ఆర్టీసీ స్పెషల్ సర్వీసును ఏర్పాటు చేసినట్లు మదనపల్లె టూ డిపో మేనేజర్ నిరంజన్ తెలిపారు. మదనపల్లెలో బస్సు ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు బయలు దేరి, తిరిగి 29 ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. టికెట్టు ధర రూ.3 వేలు అని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



ఉన్నిగానిపల్లెలోఎమ్మెల్సీ భరత్‌కు ఆత్మీయ స్వాగతం పలుకుతున్న మహిళలు

రామకుప్పం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ఇంటింటికీ సంక్షేమ లబ్ధి అందుతోందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉన్నిగానిపల్లె పంచాయతీ పరిధిలోని ఉన్నిగానిపల్లె, గూళ్లపల్లె, జోగిండ్లు, పెద్దగానూరులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులతో, పూలతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఉన్నిగానిపల్లెలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నియోజక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో పనులను వేగవంతం చేయాలన్నారు. ఉన్నిగానిపల్లెలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీకి చెందిన నరసింహప్ప కుటుంబం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. అనంతరం మండలంలోని అత్తికుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత సుబ్బారెడ్డి, బైపరెడ్లపల్లె గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త నారాయణప్ప మృతదేహాలకు ఆయన నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని భరత్ హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ నేత్రావతి, ఎంపీటీసీ సభ్యురాలు సులోచన, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, పార్టీ ప్రచార కార్యదర్శి కేశవ రెడ్డి, స్థానిక నేతలు గుర్రప్ప, మురుగేష్, సుబ్రమణ్యం, శంకర్, చంద్రమోహన్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రత్యేక సలహాదారుగా వరదరాజులు



వరదరాజులుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: మున్సిపల్ పరిధిలో వైఎస్సార్ సీపీ ప్రత్యేక సలహాదారుడిగా వరదరాజులును నియమిస్తు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలో 13 వార్డుకు చెందిన వరదరాజులు టీడీపీ క్రియాశీలక నేతగా ఉండేవారు. కుప్పం పంచాయతీగా ఉన్నప్పుడు టీడీపీ మద్దతుదారుడిగా నాలుగు సార్లు వార్డు సభ్యుడిగా, ఒక్కసారి ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. గత ఏడాది కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరుఫున 13 వార్డు కౌన్సిలర్ స్థానానికి పోటీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి సమక్షంలో సదుంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయన టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరడంపై మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, వైస్ చైర్మన్ మునుస్వామి హర్షం వ్యక్తం చేశారు. వరదరాజులును వైఎస్సార్ సీపీ ప్రత్యేక సలహాదారుగా నియమించడంపై పలువురు పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా సల్లాపురెమ్మ జాతర



పూజ సామగ్రితో ఆలయానికి వెళుతున్న మహిళలు

బైరెడ్డిపల్లె : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీసల్లాపురెమ్మ ఆలయ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయం మహిళలు పిండి దీపాలతో వెళ్లి మొక్కుబడులు చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఎయిడ్స్ మృతులకు నివాళులర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

పలమనేరు: ఎయిడ్స్ రహిత సమజాన్ని నిర్మిద్దామని పలమనేరు ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ శోభారాణి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ స్మారక దినోత్సవం సందర్భంగా పట్టణంలో కోర్, విహాన్, చైల్డ్‌ఫడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థల సిబ్బంది ఆదివారం కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ మృతుల ఆత్మ శాంతి కోసం కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించినట్లు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కోర్ సంస్థ నుంచి రమాదేవి, గంగ, సుమతి, విహాన్ ప్రాజెక్టు నుంచి కళావతి, చైల్డ్‌ఫడ్ ఇండియా నుంచి రాణి తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌కు ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సంఘం నాయకులు

పుంగనూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన పట్టణానికి చెందిన మెకానిక్ శివకుమార్‌కు సంఘం నాయకులు అర్షద్‌అలి, బండకుమార్ ఆధ్వర్యంలో రూ.40 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం బాధితుడి ఇంటికి మెకానిక్‌ల సంఘం నాయకులు వెళ్లి సాయం అందజేశారు. అర్షద్‌అలి మాట్లాడుతూ వైద్య ఖర్చుల కోసం ఈ మొత్తం అందజేసినట్లు తెలిపారు. అజ్మతుల్లా, సుధాకర్, చోటు, ఫజులు, అబ్దుల్‌రవూఫ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మగుడికి నాణ్యమైన విద్యుత్



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్

కుప్పం: పట్టణంలోని ప్రముఖ శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ దేవస్థానానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఆలయ ప్రాగణంలో రూ.4 లక్షల వ్యయంతో దేవస్థానికి మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దేవస్థానం చైర్మన్ మంజూనాథ్, రెస్కో ఎండీ సుబ్రమణ్యం, స్థానిక నాయకులు ఉదయ్, రంగయ్య, రెస్కో సిబ్బంది ప్రభాకర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

జాతర ప్రసాదాల వితరణ



పావణిగౌడకు ప్రసాదాలు అందిస్తున్న కమిటీ సభ్యులు

పలమనేరు: పట్టణంలో ఇటీవల జరిగిన గంగమ్మజాతర ప్రసాదాలను ఆలయ కమిటీ ఆదివారం వితరణ చేసింది. ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావణిగౌడకు అమ్మవారి సారె, ప్రసాదాలను కమిటీ చైర్మెన్ నరేష్, సభ్యులు ప్రసాద్‌రెడ్డి తదితరులు అందించారు.

నేడు కొలమాసనపల్లెలో గడప గడపకు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీలో సోమవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ బాలాజీనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కొలమాసనపల్లెలో కార్యక్రమం ప్రారంభమతుందన్నారు. గంగారుపూరు, దొడ్డిపల్లె ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే పర్యటిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ వెంకటనరసింహులు

బైరెడ్డిపల్లె: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని కైగల్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మండలంలోని గంగారపూర్ గ్రామానికి చెందిన రెడ్డెప్ప, సుమిత్ర ద్విచక్రవాహనంపై 82 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా పట్టుబడ్డారు. ద్విచక్రవాహనంతో పాటు మద్యం స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

సదుం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆదివారం స్థానిక మహాత్మా జ్యోతీరావ్ పూలే గురుకుల పాఠశాలలో ఫుల్ టైం గెస్ట్ టీచర్లు వినతిపత్రం అందజేశారు. డిసెంబర్‌లో అమలు చేసే నూతన పోస్టులతో ఉద్యోగాలు పోయే పరిస్థితి ఉందని, గతంలో ఇచ్చిన జీఓ నంబర్ 23ను అమలు చేయాలని విన్నవించారు.